# దేవుడు

## మల్లంపల్లి కృష్ణారావు

"కౌసల్యా సుప్రజారామ, పూర్వా సంధ్యా ప్రవర్తతే" ఆ గదిలో నలుగురి కంఠాలు ఏక కంఠంగా లోకాలన్నీ గళాలెత్తి వెంకటేశ్వరస్వామిని మేలుకొలుపుతున్నాయా అన్నట్లుగా ధ్వనిస్తున్నాయి. వింటున్న శ్రోతలందరూ మరో ధ్యాస లేకుండా తదేకంగా మనిషంత ఎత్తున్న వెంకటేశ్వరస్వామి ఫొటోకేసి భక్తి శ్రద్ధలతో చూస్తున్నారు. అందరి మనసుల్నీ కేంద్రీకరింప చేసుకున్న ఆ స్వామి ఫొటో దీపాల వెలుగులో వెంకటేశ్వరుడే అందులోంచి చూస్తున్నాడా అన్నట్టుగా మెరిసిపోతోంది. అగరువత్తుల సువాసన విలువగల సాంబ్రాణి ధూపం వేడి వేడి ప్రసాదాల ఆవిరి అన్నీ కలసి కొత్త గుబాళింపు నింపుతోంది. గుండెల్లో మార్మోగుతున్న ఆ సుప్రభాతపు ఘోషలో మా "రామం" కంఠంకూడా వుంది.

ఒక్కసారిగా జనం ఉద్రిక్తులయ్యారు. బక్కపలచగా ఉన్న యువకుడు ఒకతను లేచి నిలబడ్డాడు. అతని కళ్ళు అర్థనిమీలంగా మూతబడి ఉన్నాయి. చేతులు రెండూ శంఖు చక్రాలను ధరించిన విధంగా నిలబడి వున్నాయి. భరించలేని ఉద్వేగం ఆవరించినట్టు అతని శరీరం వణుకుతోంది. "స్వామి వేంచేశారు" అన్న భావం అందరి మనస్సుల్లోనూ ఒక్కసారి చిరుగాలిలా ఆవరించి ఉత్తేజితుల్ని చేసింది. రామకృష్ణ పరమహంసలా గడ్డాన్ని పెంచిన ఒక ముసలాయన కర్పూరహారతి వెలిగించి ఆ యువకుడికి నీరాజనం యిస్తున్నాడు. అందరూ లేచి "మంగళం" చదివి సాష్టాంగంగా స్వామి ఆవహించిన ఆ యువకుడికి దండ ప్రమాణాలు చేశారు. ఆ యువకుడ్ని గడ్డపాయన ఫేము కుర్చీలో కూర్చోబెట్టి భక్తితో విసురుతున్నాడు.

నాకిదంతా ఆశ్చర్యంగా ఉంది. ఇదివరకు నేనెప్పుడూ యిలాంటి "గాడ్ డిసెండింగ్" కాదు గదా "ఘోస్ట్ డిసెండింగ్" కూడా ఎరగను. ఇంతా చేసి ఆ కుర్రవాడికి పాతికేళ్ళుండవు. దీపాల వెలుగులో మొహం పాలిపోయినట్టుంది. నీర్సంగా ఉన్నాడు. ప్రసాదాలకి బదులు మామూలు భోజనం చేస్తే అతనింకా బలంగా ఉండేవాడని నా "డాక్టర్ ఇన్‌స్టింక్ట్" చెపుతోంది. అభాగ్యగతులందరూ ఆ భగవంతుణ్ణి సంబోధిస్తూ ఏవో ప్రశ్నలు అడుగుతున్నారు. "మా అబ్బాయికి నాలుగేళ్ళు వచ్చినా మాటలు రావడం లేదు, ఏం చెయ్యమంటారు

స్వామీ?" అనే ప్రశ్నకి "శనివారం ఉపవాసం వుండు, అంతా బాగుపడుతుంది" అనే సమాధానం. "పెంకుటిల్లమ్మి పిల్ల పెళ్ళి చేద్దామనుకుంటున్నాం స్వామీ, లాభసాటి బేరం వస్తుందా?" అనే ప్రశ్నకి "యిల్లమ్మి కొండకొస్తానని మొక్కుకో, అంతా బాగుపడుతుంది" అనే సమాధానాలు మెల్లి మెల్లిగా విన్పిస్తున్నాయి. నామట్టుకు నేను తదేకంగా స్వామికేసి చూస్తున్నాను. ప్రశ్నలు అయిపోయినట్టున్నాయి. దేవుడికి ప్రసాదం పెట్టారు. అతను కళ్ళు మూసుకునే ప్రసాదాన్ని తిని పళ్ళాన్ని పక్కనున్న గడ్డపాయనకిచ్చి "ఇంక నేను వెళ్తాన్రా!" అన్నాడు. అందరూ స్వామికి పాదాభివందనం చేశారు. కాసేపటికి ఆ కుర్రాడు వెనక్కి పడిపోయాడు. అతన్ని మెల్లిగా ఎత్తి మంచంమీద పడుకోబెట్టి విసురుతున్నాడు ఆ పెద్దాయన. కొంతసేపటికి అతను కళ్ళు విప్పి బలహీనంగా నవ్వి లేచి కూర్చున్నాడు. ఒకావిడ కాఫీ యిచ్చింది, అందరూ గదిలోంచి బయటకు నడిచారు.

ఈ వాతావరణం అంతా నాకు చాలా కొత్తగా ఉంది. నిజానికి మా రామం అక్కడ ప్రముఖ పాత్ర వహిస్తున్నట్టు నాకు తెలియకపోతే నేను వచ్చే జన్మలోకూడా యిక్కడికి వచ్చి ఉండను. (జన్మలంటే నాకు నమ్మకం లేదనుకోండి అందుకే). రెండు నెల్ల క్రితం వరకూ రామం నోట్లోంచి "మార్క్స్", "మావో"ల మాట తప్ప మరో సంగతొచ్చేది కాదు. మా ఆవిడతో వచ్చిన మనస్పర్థ గురించి చెప్తే "వర్గ పోరాటం తప్పదు, ఏం చేస్తాం!" అనేవాడు. పనిమనిషి రాక యిబ్బంది పడుతూంటే "సంఘంలో వర్గ విభజన ఉన్నంత కాలం ఏ మనిషికీ నిజమైన సౌఖ్యం వుండదు" అనేవాడు. గడ్డం పెరగడం దగ్గర్నించీ, ఫ్లయింగ్ సాసర్లదాకా ఉన్న అన్ని సమస్యలకీ వర్గ నిర్మూలనే పరిష్కారమనేవాడు. అప్పటికీ ఇప్పటికీ ఒకటే తేడా వాడిలో. పూర్వం ఎప్పుడూ వాడి నోట్లోంచి "వర్గం" అనేమాట విన్పించేది. యిప్పుడు "దేవుడు" అనే మాట విన్పిస్తోంది. ఆ రోజుల్లో వాడు మా యింటికి వచ్చేటప్పుడు మా యింటి యజమాని వదిలేసిన వెంకటేశ్వర స్వామి ఫొటోకి, వాడి బద్ధకం అంతా వదుల్చుకుని వాడికి పరమ అసహ్యమైన ఓ సినిమా కేలండర్ అడ్డం పెట్టేవాడు. "ఏమిట్రా! అది అంటే", "ఫర్వాలేదు, ఈ కేలండర్ చూస్తే మనకో జంతువు గుర్తుకొస్తుంది, అంతే! కాని ఆ ఫొటోలోవాణ్ని చూస్తే మన దేశంలో వున్న దౌర్భాగ్యం గుర్తుకొస్తుంది. ఆ ఫొటోలోవాడు దేశాన్ని మూర్ఖత్వంలోకి ముంచేసే అజ్ఞానానికి పెద్ద సింబల్. వాడి దృష్టుల్లోంచి ఎంత తప్పించుకుంటే అంత మంచిది" అనేవాడు. అలాంటివాడు యిప్పుడు నిలువెత్తు వెంకటేశ్వరస్వామి ఫొటో ముందు తదేకంగా సుప్రభాతం గుండెలదిరేలా చదువుతున్నాడని తెలిస్తే వచ్చి చూడకుండా ఎలా ఉండగల్ను!

నేను అందరితోపాటు గదిలోంచి బయటకి నడవబోతూండగా రామం నన్ను చూసి "అరె! నువ్వెప్పుడొచ్చావ్!" అంటూ పలకరించాడు ఆశ్చర్యంగా చూస్తూ.

"నువ్వు అంత గొంతు చించుకొని సుప్రభాతం చదవగాలేంది, నేను చూడ్డానికి రావడమే ఆశ్చర్యమా?" అన్నాను. రామం "రా! మా బాబాయ్‌ని చూపిస్తాను, హైలీ స్పిరిట్యువల్ పెర్సనాలిటీ" అంటూ ఆ పెద్దాయన దగ్గరికి తీసికెళ్ళాడు.

"బాబాయ్ వీడు నా పూర్వాశ్రమంలో ఫ్రెండు. యిద్దరం కూడా మొన్న మొన్నటిదాకా విద్యార్థి దశలో విప్లవం అంటూ గంతులు వేసిన వాళ్ళమే! దేవుణ్ణి, మతాన్ని నల్లమందు

మాత్రల్లా చూసిన వాళ్ళమే. ఆఫ్‌కోర్సు నేనా అంధకారంలోంచి బయటపడ్డాననుకో. వీడికి మాత్రం యింకా ఆ పాతఛాయలు పోలేదు. డాక్టర్ కదూ! సైన్సు అంటూ దేవుళ్ళాడుతున్నాడు. అందుకే నీ దగ్గరకు తీసుకొచ్చాను" అంటూ నవ్వాడు రామం. ఆయన నన్ను ఉద్ధరిస్తాడనే విషయంమీద అత్యంత నమ్మకంతో సంతోషపడిపోతూ.

"దేవుడు యిల్లాంటి వాళ్ళకోసమే ఎరవేస్తాడ్రా! వీళ్ళద్వారా యింకా పాప్యులారిటీ సంపాదించుకోగలనని ఆయనకి బాగా తెలుసు" అన్నాడు ఆయన నవ్వుతూ.

నిజమే! రామంతోపాటు అక్కడున్న మిగతా వ్యక్తుల్ని కూడా అలాంటి వాతావరణంలోనే చూస్తానని కలలోకూడా అనుకోలేదు. యిది గొప్ప విచిత్రంగా కన్పించింది. ఈ బాబయ్యగారు వీళ్ళందర్నీ ఎలా వశపర్చుకున్నాడో నాకు అర్థంకాలేదు.

"మీరు వస్తారని రామం చెప్పాడు - చెప్పి మూడు వారాలయింది. ఇప్పటికి గానీ మీరు రాలేదు" అన్నాడు బాబయ్యగారు నాకేసి చూస్తూ.

"వద్దామనుకుంటూనే ఉన్నాను. నా ఉద్యోగం అంత తేలికగా నన్ను వదలదు. అంతకు మించిన ఆశ్చర్యం రామం విషయం. వాడు మామూలు వ్యక్తి కాదు. తను నమ్మింది త్రికరణశుద్ధిగా చేసే రకం. మర్మాలు, లౌక్యాలు వాడికి తెలియవు. మత వ్యవహారాల్ని, దైవభక్తినీ విపరీతంగా వ్యతిరేకిస్తూ చాలామంది దగ్గర వాళ్ళనీ, బంధువుల్నీ వదులుకున్న రామాన్ని మీరు యింతగా మార్చేశారని తెలిసినప్పట్నించి మిమ్మల్ని చూడాలని నాకు కుతూహలంగా ఉంది" అన్నాను నేను.

"యిందులో ఆశ్చర్యం ఏమీ లేదు. రామం అదృష్టవశాత్తూ నేను వాడి బంధువును. వాడి చిన్నప్పట్నించి నేను రామాన్ని గమనిస్తూనే వున్నాను. ఆఖరికి వాడికి ఉపదేశం యివ్వవలసిందిగా నాకు దేవుడు ఆదేశం యిచ్చాడు. విచిత్రమైన విషయం, సరిగ్గా నేను రామానికి ఉపదేశం యివ్వాలనుకున్న కాలంలో వాడు రామకృష్ణ పరమహంస పుస్తకాలు చదువుతూ వుండేవాడు. వాడూ వివేకానంద అంత కావాలని దేవుడు ఆకాంక్షిస్తున్నాడు కాబోలు" అన్నారు బాబయ్యగారు తనో పరమహంస అయినట్టు.

"దేవుడంటే ఆ కుర్రవాడేనా?" అనడిగాను.

రామం మధ్యలో అందుకుని "అతనిపేరు రాఘవ, బాబాయికి మేనల్లుడే" అన్నాడు.

"దేవుడొక్కడే. రాఘవ చిన్నవాడైనా వాడి పవిత్రతవల్ల దేవుడు వాడిపై వాలుతున్నాడు. రాఘవకి దేవుడు వాల్తున్నప్పుడు స్మృతి వుండదు కాబట్టి దేవుణ్ణి గమనించలేడు. కానీ నేను దేవుడితో మాట్లాడగలను. నా అంతరాంతరాలలో దైవవాణి ఎప్పుడూ వినబడుతూనే వుంటుంది. నాదగ్గరున్న పూజా విగ్రహాలు స్వామి స్వయంగా నాకిచ్చినవే. రాఘవ నా దశకి చేరుకోడానికి యింకా చాలా కాలం వుంటుంది" అన్నారు బాబయ్యగారు.

"అది సరే కాని, మా రామం మార్క్సిజాన్ని మీ దేవుడు ఎలా జయించగలిగాడు?" అన్నాను.

"మార్క్స్‌ని సృష్టించినవాడూ దేవుడే" అన్నాడాయన.

నాకు వళ్ళు మండింది. ప్రతి వేదాంతిలాగే ఈయనా బుర్ర లేనివాడిలా అసందర్భంగా మాట్లాడుతున్నాడు. నా ప్రశ్నకి అది జవాబు కాదు. ఈయన చెప్పగలిగినవాడిలా కూడా

కన్పించడంలేదు. రామాన్నే అడిగితే సరిపోతుంది. "రామం నేను పోతాను, కాస్త బస్ స్టాండ్ దాకా దిగబెడుదూ!" అని "వస్తాను బాబయ్యగారూ! తర్వాత కలుసుకుంటాను" అంటూ బయల్దేరాను. రామం ఆగరా అంటూ రాఘవని తీసుకొచ్చి పరిచయం చేశాడు. రాఘవని చూడాలని నాకూ కుతూహలంగానే వుంది.

రెండు నిముషాలు నుంచుంటే పడిపోతాడేమో అన్నంత నీర్సంగా వున్నాడు రాఘవ. మొహంలో ఎక్కడా తెలివితేటలున్న లక్షణాలు కన్పించడం లేదు. "దేవుడ్ని ఆవాహన చేసినప్పుడు మీకెలా వుంటుంది?" అడిగాను.

అతను నవ్వి, "నాకు తెలీదు. స్వప్నావస్థలా వుంటుంది. మాటలు వినబడతాయి. నేను మాట్లాడ్తాను, కానీ యివేవీ నా కంట్రోలులో వుండవు. నిద్రలో వున్నట్టుంటుంది. హఠాత్తుగా మెలుకువ వస్తుంది. చాలా నీర్సంగా వుంటుంది. అప్పుడు నాకు తెలుస్తుంది దేవుడు వాలాడని" అన్నాడు.

"అదృష్టవంతులు, సామాన్య విషయం కాదు" అన్నాను వ్యంగ్యంగా.

"నిజంగా అదృష్టమే, చిన్నప్పటినుంచీ మా మామయ్య దగ్గరే వుంటున్నాను కాబట్టి ఈ భాగ్యం దక్కింది? దైవ సాక్షాత్కారంకూడా లభిస్తుందనే అంటాడు మా మామయ్య".

నాకింక భయం వేసింది. నేనే దేవుణ్ణంటాడని. శలవు తీసుకుని రామంతోపాటు బయటకు వచ్చేశాను. వస్తూనే, "ఏమిట్రా యిది? మతిపోయిందా?" అని నిలవేశాను.

"ఇంకా నువ్వు మారలేదన్నమాట. దేవుడ్ని ప్రత్యక్షంగా చూసికూడా" అన్నాడు రామం.

"ఏడిసినట్టే వుంది".

"ఒరే! మనం యింతవరకూ పొరపడ్డాం. ప్రకృతిని మించిన శక్తి ఎప్పుడూ ఉండనే ఉంది. మన కంటికి కనిపించని విద్యుత్తే, అయస్కాంతంలాంటి శక్తి రూపాలతో మనిషి యిన్ని మిరకిల్స్ చేస్తున్నాడంటే మనిషిలోని కాంషస్‌నెస్ ఎంత గొప్ప శక్తి అంటావ్? మానవ శరీరం అనే భౌతిక పదార్థంచేత యిన్ని మిరకిల్స్ చేయిస్తున్న కాంషస్‌నెస్ కన్నా యూనివర్సల్ కాంషస్‌నెస్ యింకెంతో ఉన్నతమై వుంటుంది. చంద్రుడు భూమికి యింకొన్ని మైళ్ళ దగ్గర్లో వుంటే భూమంతా నీటిమయమౌతుందట. ఆ గ్రహగతులవల్ల భూమి మీదే అంత ప్రభావం వుంటే మనుష్యుడిమీద యింకెంత ప్రభావం వుంటుంది?"

నాకు వళ్ళు మండింది. యిదంతా దేవుడ్ని, జాతక శాస్త్రాన్ని సమర్థించడం కోసం సైన్సుని అడ్డం పెట్టుకోవడమే. "నీ ఖర్మ" అన్నాను.

"నా ఖర్మేగానీ, నువ్వు ప్రతి శనివారం మా యింటికి వస్తూ వుండు. దేవుడు శనివారం నాడు దర్శనం యిస్తాడు. రాఘవని మా యింట్లోనే వుంచేసుకుంటున్నాను" అన్నాడు రామం.

"రాఘవ మీ యింట్లో వుండటమేం? సీతకి పని తక్కువయిందనా?" అన్నాను.

"మా ఆవిడ ఒప్పుకుందిలే. అతను ప్రయివేటుగా బి.ఏ.కి కడదామనుకుంటున్నాడు. పరీక్షలొస్తున్నాయని కోచింగ్ యివ్వమని బాబయ్య నాదగ్గరే వుంచేస్తున్నాడు" అన్నాడు రామం.

"అదేమిట్రా! నువ్వు కోచింగ్‌కూడా యివ్వాలా! దేవుడు ప్యాసు చెయ్యడూ! అయినా అతనికి ఐహికమైన బి.ఏ. డిగ్రీ ఎందుకు?"

"ఈ ప్రపంచంలో వున్నంతకాలం ఐహికమైన విషయాలు పట్టించుకోవలసిందే. ఉద్యోగంకూడా మానేస్తానన్నాడు కాని బాబయ్య ఒప్పుకోలేదు. రాఘవది గొప్ప భక్తిలే".

ఇంతలో సిటీ బస్సు వచ్చేసింది. రామం దగ్గర సెలవు తీసుకొని నేను బస్సెక్కి యింటికి బయల్దేరాను. బస్సులో వున్నంతసేపూ రామం గురించి ఆలోచనే - వాడిలా యెందుకు మారాడని. వాడిలో మార్పుకు కారణం కొంతవరకూ నేను ఎనలైజ్ చెయ్యగల ననుకుంటాను. వాడు మేధావే. అయితే చిన్నప్పటినుంచీ చాలా సున్నితంగా పెరిగినవాడు. శ్రమని భరించలేడు. వాడు వర్గ సిద్ధాంతాన్ని గొప్ప సిద్ధాంతంగా నమ్మినా ఆచరించలేక పోయాడు. వర్గ సిద్ధాంతం తత్వశాస్త్రంలా చదివి ఆనందించాల్సింది కాదు. దాన్ని ఆమోదించిన ప్రతి వ్యక్తిని అది తీవ్రమైన విప్లవ కార్యాచరణలోకి తోస్తుంది. సుకుమారంగా బతికేవాడు విప్లవ కార్యాల్ని యేం చెయ్యగలడు? అందుచేతే వాడికీ, వాడి సిద్ధాంతానికీ బాలన్సు కుదరలేదు. వేదాంతం వాడికి సరిపోయుండవచ్చు. మతాన్ని నమ్మినవాడికి స్నానం చేసి దేవుడి పటం ముందు కూర్చోడం మినహా యింక చెయ్యాల్సింది లేదు.

వారం రోజులకోసారి రామాన్ని చూసేవాడ్ని, రెండు నెలలైనా వాళ్ళింటికి వెళ్ళలేదు. వాడు అప్పుడప్పుడు వస్తూనే ఉన్నాడు కానీ పూర్వం అంత స్వేచ్ఛగా ఉండలేకపోతున్నాం. రామం మారిపోకుండా వుండి నేనే ఆస్తికుడిగా మారిపోతే వాడు నా మొహం చూసి ఉండేవాడు కాదని నాకు తెలుసు. కానీ రామాన్ని నేనంత సులువుగా వదులుకోలేను. పైగా రామం వచ్చి సీత నిన్ను రమ్మని వందసార్లైనా చెప్పిందిరా" అన్నాడు కాబట్టి నేను రామం యింటికి బయల్దేరక తప్పింది కాదు. ఆవేళ ఆదివారం కాబట్టి రామం యింటివేపు వెళ్ళే బస్సు పట్టుకున్నాను.

యింట్లోకి వెళ్ళేసరికి సీత ఎదురైంది. "మమ్మల్ని బాయ్‌కాట్ చేద్దామనుకున్నారా ఏమిటి? లేకపోతే మావదినగారు యిల్లు కదలకూడదని ఆర్డరు చేసిందా! ఈవేళ రాకపోతే నేను బయల్దేరదామనుకున్నా" అంది.

నేనే నవ్వి - "వద్దనుగానీ మీ యింట్లో నాకన్నా ముఖ్యమైన మనుషులున్నారు. మర్యాదకి లోపమొస్తుందని భయపడ్డాను" అన్నాను.

"కూర్చోండి ఆయన యిప్పుడే టౌన్లోకెళ్ళారు" అంది కుర్చీ తెస్తూ.

మీ యింట్లో ఆ దేవుడు కూడా ఉంటున్నాట్ట కన్పించడేం!" అన్నాను.

"ఎవరూ! రాఘవా! యిక్కడే వుంటున్నాడు. అతనికి ఆదివారంకూడా ఆఫీసులో పని వుందట. మధ్యాహ్నం వస్తాడు" అంది.

"మంచి గొడవగా ఉందే" అన్నాను చుట్టూ గోడమీదున్న దేవుడి పటాలకేసి చూస్తూ. పూర్వం యివేవీ ఉండేవి కావు.

"మీ ఫ్రెండుతో ఏమొచ్చినా విపరీతమే. పూర్వం నాన్-వెజిటేరియన్ నేను తినను మొర్రో అంటూంటే బలవంతంగా తిన్పించేవారు. యిప్పుడు తెల్లారగట్టే లేచి స్నానం చేసి ఆయనతో పాటు నేనుకూడా పూజ చేయాలిట. వెళ్ళవకముందు ఎనిమిది

గంటలకి ముందు లేచి ఎరుగను. యిప్పుడు రాఘవకూడా యిక్కడే ఉన్నాడుగా యింక చూసుకోండి. తెల్లారగట్టే నాల్గు గంటలకి మొదలు పెడతారు సుప్రభాతం. ఆరయ్యేవరకూ అవదు. మళ్ళీ రాత్రి ఏడు గంటలకు మొదలు. పోనీ ఆ పూజేదో మెల్లిగా చేసుకున్నా బావుండును. వీళ్ళ గొడవకి చంటివాడు నిద్రలేచి ఏడుపు మొదలు పెట్టడం, వాణ్ణి సముదాయించలేక నా ప్రాణాలు పోతాయి. వాళ్ళ పూజేదో వాళ్ళు చేసుకుంటారా అంటే అలా కాదు. మధ్యలో నేనుకూడా వాళ్ళ పూజలికి కావలసిన సామాన్లు సప్లయి చేస్తూ వుండాలి. మీ ఫ్రెండుది అంతా చిన్నపిల్లాడి తంతు. కొత్తగా యేమొచ్చినా యింక ఒళ్ళెరగరు. ఇక శనివారం చూడండి. ఇల్లంతా సత్రం. ఎక్కడెక్కడి వాళ్ళో వస్తారు ప్రశ్నలడగటానికి. వాళ్ళకి పులిహోర, పానకం చెయ్యడానికి తల ప్రాణం తోక్కొస్తోంది". సీతకి రాముం గురించి నా దగ్గర మాట్లాడే చనువుంది. వాళ్ళిద్దరి పెళ్ళికి చాలావరకూ కారణభూతుణ్ణి నేనే.

"సహాయ నిరాకరణ చెయ్యవలసింది" అన్నా నేను.

"యింకా నయం మీ ఫ్రెండుకోపమొస్తే యింకేమైనా వుందా?" అంది సీత.

"ఆ దేవుడు రాఘవ బి.ఏ.కి కడ్తున్నాడన్నారు. పరీక్షలు రాశాడా?" అనడిగాను.

"ఆ రాశాడు. అదో పెద్ద ఎడ్వెంచరు. మీ ఫ్రెండు అతని పుస్తకాలన్నీ ముందు చదివి, వాటికి నోట్సు వ్రాసి అతనికివ్వడం, అతను వాటిని తీరిగ్గా చదవటం. పాపం ఈయనకి రాత్రిళ్ళు రెండు గంటలదాకా ఆ నోట్సులు ప్రిపేర్ చెయ్యడంతోనే సరిపోయేది. మధ్యలో పూజలు. రాఘవ చదివేది తక్కువైనా రాత్రిళ్ళు టీలు చేసి యివ్వాలి. నేను టీలు చేసి, ఆయన నోట్సులు రాసి అతని బి.ఏ.లో ముప్పాతిక మేమే చదివామనుకోండి".

"శుద్ధ దౌర్భాగ్యుడిలా వున్నాడే ఆ రాఘవ" అన్నాను.

"పాపం! అతను చాలా అమాయకుడండీ, దేవుడు పూనడం సంగతి నాకు పూర్తిగా తెలీదు కాని. అతను యింకొకళ్ళను మోసం చేసేటంత తెలివైన వాడు కాదు. "దేవుడు నాకు పూన్నాడు" అని అతను నిజంగా నమ్ముతూ వుండడంవల్ల అతనికి పూనకం వస్తూ వుండొచ్చు. అతన్ని చిన్నప్పట్నించి అలా బ్రైనప్ చేసింది ఆ బాబయ్యగారే. అతనిది చాలా అమాయక హృదయం. ఏ పని యెవళ్ళో ఒకళ్ళు చెపితేనే కాని చేసుకోలేడు. సరిగా భోంచెయ్యడు. కాఫీలు మాత్రం తెగ తాగుతాడు. ఒకసారి రేడియోలో ఏదో నాటకంలో హీరోయిన్ చచ్చిపోతే అతని కళ్ళమ్మట నీళ్ళొచ్చాయి. కాని ఒకందుకు మాత్రం ఒళ్ళు మండుతుంది. తనేదో మిగిలిన మనుషులకన్నా గొప్పవాడిననీ, తనకన్నీ ప్రత్యేకంగా ఉండాలనీ అనుకుంటాడు. మాట్లాడేటప్పుడూ అదే గర్వం. తను దేవుడికి దగ్గరవాడైనట్లూ, మిగిలిన వాళ్ళందరూ పిటియబుల్ ఫెలోస్ అయినట్లు, పాపం! అదికూడా అమాయకత్వమేలెండి" అంటూ సీత జాలిపడింది.

నేను "వీక్ లింగ్స్ కూడా విలన్సేనమ్మా" అన్నాను.

"అబ్బే, నేను అతన్ని గ్లోరిఫై చెయ్యడం లేదు. అతనికి దేవుడు పూనుతున్నాడంటే నేను నమ్మనుగానీ, అతను విల్ ఫుల్ గా దేవుడు పూనినట్లు నటించలేడు. మా ఆయనకి మాత్రం యింత చాదస్తం రావడం విచిత్రంగా ఉంది. ఆయనకి పుస్తక పరిజ్ఞానమే కానీ,

వ్యవహారికమైన తెలివితేటలు తెలియవు. ఏది నమ్మినా యింత తీవ్రంగానూ నమ్మేస్తారు. ఇంక ఆయనకి నేనేం నచ్చచెప్పను? అసలు మీ ఫ్రెండ్ని కన్విన్సు చెయ్యడంలో రాఘవ పాత్రేం లేదు. ఆ బాబయ్యగారే చేశారు. ఆయన చాలా తెలివైన వాడులెండి..... ఇంతవరకూ వాళ్ళమ్మగారు ఎంత గోలపెట్టినా మూడేళ్ళకు పైగా వాళ్ళాయన వెళ్ళని మీ ఫ్రెండు ఆ బాబయ్యగారితో తిరుపతి వెళ్ళే ప్రయత్నంలో ఉన్నారు. ఇంకా ఘోరం ఏమిటంటే ఆయన కూతురి పెళ్ళికి మీ ఫ్రెండు నాలుగు వేలిస్తున్నారు చూడండి".

నేను "దేవుడా! రక్షించు. లక్షలాది దేవుళ్ళనుండి మా రామాన్ని" అనుకుంటూండగా రాఘవ వచ్చాడు. వస్తూనే "నమస్కారం డాక్టర్ గారూ! ఎప్పుడొచ్చారు? మీరు శనివారం రావడం లేదు. దేవుడికి దూరంగా పోవడం చాలా కష్టం సుమండీ" అన్నాడు.

"అదే కదండీ నా భయం కూడా" అన్నాన్నేను.

సీత కాఫీలు తీసుకొస్తానంటూ లోపలకెళ్ళింది.

"పరీక్షలు బాగా రాశారా?" అనడిగాను రాఘవని.

"రాశాను లెండి, రాయకపోయినా పాసవుతాననే ధైర్యం ఉంది. బి.ఏ.కి కట్టమని చెప్పిన దేవుడు ప్యాసు కూడా చేస్తాడు. ఏమిటోనండీ, నాకే ఉద్యోగం మీద, బి.ఏ. మీద యింటరెస్ట్ లేదు. యివి వదులుకుని హిమాలయాలకు పోవాలని ఉంది. కానీ దేవుడే యివన్నీ చేయిస్తున్నాడు."

"హిమాలయాలకు పోతే ఎల్లాగండీ! తిరుపడి కొండ వుందిగా?" అన్నాను. అతన్ని చూస్తే గొప్ప జుగుప్సగా వుంది నాకు. ఎలాగైనా కించపరచాలని మహా యిదిగా వుంది.

"అది సరేగాని డాక్టరుగారూ! నాకు ఎప్పుడూ తలనొప్పిగా, నీరసంగా ఉంటుందండీ, ముఖ్యంగా దేవుడు వెళ్ళిపోయింతర్వాత ఏస్ప్రోలాంటివి ఏమీ పని చేయడం లేదు. ఏ మందు వాడమంటారు" అనడిగాడు.

"మీరు 'మందు' దేవుడ్ని అడక్క నన్నడిగారు కాబట్టి మీ జబ్బేమిటో చెబుతున్నాను వినండి. మీ వయస్సుకి మీరు యింతకన్నా ఆరోగ్యంగా వుండాలి. మీరు శారీరకంగానూ, మానసికంగానూ కూడా నీరసంగానే వున్నారు. ఈ ఉపవాసాలూ, పూజలూ, శరీరాన్ని కష్ట పెట్టుకోడాలూ, ప్రసాదాలు తినడాలు మానేస్తే మీ జబ్బు తగ్గుతుంది. నీరసంగా వున్నవాళ్ళు అతిగా నవ్వినా, ఏడ్చినా గడ్డకట్టుకు పోయినట్టు మీరు అతి భక్తితో దేవుడు పూనినట్లు ఉద్రేకపడుతున్నారు. నాలుగు రోజులబట్టి పస్తున్నవాడికొచ్చే భ్రాంతుల్లాంటిదే మీ పూనకం కూడా, నేను చెప్పేది అర్థమయిందనుకుంటాను. మీకొచ్చేది పూనకం కాదు 'ఎపిలెప్సీ' లాంటి జబ్బు. పాపం మీరా జబ్బులో ఎవరో భక్తుడు మాటలు రాని కొడుక్కి మాటలు వస్తాయా అనడిగితే శనివారాలు చెయ్యమన్నారు, యింక అతను ఆ కొడుకుని డాక్టరుకి చూపించకపోవచ్చు. మీమీద నమ్మకంకొద్దీ ఇంకో భక్తుడు యిల్లమ్మి పిల్ల పెళ్ళి చేద్దామనుకుంటున్నాడు. మంచి బేరం వస్తుందా అంటే మీరు తిరుపతి వెళ్ళమన్నారు. ఆ తిరుపతి కెళ్ళే ఖర్చుతో అతను ఆ అమ్మాయికి అంతకన్నా మంచి సంబంధం చెయ్య గలడేమో! పాపం ఆ భక్తులందరూ మీ జబ్బుని చూచి దేవుడనుకోవడం ఘోరం. అందుచేత ఈ దేముడు, గీముడు లాంటి వేషాలు మానేస్తే, అది మీకూ ఆ భక్తులికీ కూడా

లాభదాయకం. తర్వాత మీ చదువేదో అయిపోతుంది కాబట్టి మీరు కదిలితే నేనూ, సీతా కూడా సంతోషిస్తాం, మీతో మాట్లాడడం నాకు అవమానకరమే అనుకోండి, అయినా మీరు డాక్టర్‌గా నా సలహా అడిగారు కాబట్టి చెప్పాల్సొచ్చింది". అంటూ నాకోపం అంతా కక్కేసి వంటింట్లో వున్న సీతతో వెళ్ళొస్తానని చెప్పి, కాఫీ తీసుకోకుండానే వచ్చేశాను.

ఆ తర్వాత మళ్ళీ నేను రామం ఇంటికి వెళ్ళదలుచుకోలేదు. రామంతో కూడా ఆ మాటే కాస్త మర్యాదగా చెప్పాను. రామం యింటి వాతావరణం మారే వరకూ నేను అక్కడికి వెళ్ళడంలో అర్థం కన్పించలేదు, పైగా నా ఉద్యోగం, రోజులో ఓ నిర్ణీతకాలంలో ముగిసేది కాదు. భారత దేశంలో రోగాలకు కొరత లేనంతకాలం డాక్టర్ల డబ్బుకీ కొరతుండదు. కానీ టైముకి పెద్ద కొరతొస్తుంది. ఒకవేళ ఏదో వీలు చూసుకొని వెళ్ళినా, రామం యింట్లో రాఘవని పలకరించడం యిబ్బందిగా వుంటుంది. ఉన్న అసహ్యం అంతా వెళ్ళగక్కి మళ్ళీ వాడిని ఎలా పలుకరించగలను? కాని ఆశ్చర్యం ఏమిటంటే రాఘవే మా యింటికొచ్చాడు.

ఆ రోజు రాత్రి పన్నెండు గంటలయింది. యింకా నేను నిద్రపోలేదు. బం.గో.రె. గారి మొట్టమొదటి కన్యాశుల్కం చదువుతూంటే తలుపు చప్పుడయింది. తలుపు తీసి చూస్తే రాఘవ. "మీరు శ్రమ అనుకోకపోతే రెండు నిముషాలు మాట్లాడిపోతాను" అన్నాడు. "ఫరవాలేదు రండి కూర్చోండి" అన్నాను. అతని వాలకం చాలా డిప్రెస్ అయినవాడిలా వుంది. చాలా దీనంగా వుంది మొహం.

"అంత అర్జంటు పనేమిటి?" అన్నాను.

"పనేం లేదు. మాట్లాడిపోవడం తప్ప. మీరు నన్ను అసహ్యంచుకుంటారని తెలుసు, అందుకే వచ్చాను" అన్నాడు.

ఆశ్చర్యంగా అన్పించింది. "ఏమిటీ విషయం?" అన్నాను.

"యింతవరకూ నన్నెవరూ విమర్శించలేదు. నాకు దేవుడు పూనతాడనే అందరూ అనుకున్నారు. మీరే అన్నారు మొట్టమొదట, దేవుడు పూనతాడని అనుకోవడం ఒక జబ్బని, నన్ను ఆరోజు ఏవగించుకున్నారు కూడా. దేవుడు మీకు అందుకు తగిన శిక్ష వేస్తాడని నేను మనస్సులో అనుకున్నాను. ఈమధ్యనే నా జబ్బు నాకర్థమయింది".

నేను మధ్యలో ఆపి "యివన్నీ నాకెందుకు చెపుతున్నారో తెలుసుకోవచ్చా?" అనడిగాను.

"నా పరిధిలో ఉన్న మనుషుల్లో మీరే నన్ను వెర్రి వెధవనని పసిగట్టింది - నన్ను ప్రత్యక్షంగానే తిట్టారు కూడా, ఇప్పుడు నాకు నిజంగా నేను వెర్రివెధవనన్న విషయం తెలుసుకుని, పశ్చాత్తాపపడి ఎవరి దగ్గరైనా మనసారా వెళ్ళగక్కి ఏడుద్దామనుకుంటే దురదృష్టవశాత్తూ నాకెవ్వరూ మిగల్లేదు. అందరూ నన్ను దైవాంశసంభూతునిగా చూసేవారే. అందరూ నన్ను ప్రత్యేకంగా చూసేవారే. వాళ్ళతో నేను వెర్రివెధవనని చెప్పుకుని ఎలా ఏడవడం? మీరు నాకు అంతగా తెలియకపోయినా మీరొక్కరే నన్ను అసహ్యించుకున్నారు. మీరొక్కరే నన్ను ఓదార్చగలరు".

నేను ఆశ్చర్యంగా వింటున్నాను. అతని మాటల్లోనూ, గొంతుకలోనూ తనమీద

తనకి కోపం, దుఃఖం, పశ్చాత్తాపం అన్నీ విన్పిస్తున్నాయి. హిస్టీరిక్‌గా మాట్లాడుతున్నాడు.

"మొన్నటివరకూ దేముడు నాకు పూనతాడనే విషయంలో నాకెటువంటి సందేహమూ లేదు. నేను చిన్నప్పట్నించీ మామయ్యగారింట్లోనే వుండేవాడ్ని. అందుకే చిన్నతనం నుంచీ నాకు అపరిమితమైన దైవభక్తి. మిగతా పిల్లలతో ఆడుకోడం, కాలవకి ఈతలకెళ్ళడం యిలాంటి పన్లు నేనెప్పుడూ చెయ్యలేదు. మామయ్య పూజకి ఉద్ధరిణీ, పంచ పాత్రా అందించటమో, కాళహస్తీశ్వర శతకమో వెంకటేశ్వరస్వామి సుప్రభాతం చదవడమో చేసేవాడ్ని. నాది పవిత్ర హృదయమనీ, నా భక్తి చాలా ఉన్నతమయిందనీ అందుకే దేముడు నామీద వాల్తున్నాడనీ నేను అనుకున్నాను. ప్రతీ శనివారం ఎంతో మంది భక్తులు నాకు పాదాభివందనాలు చెయ్యడం, నేనేం చెప్తే అది వేదవాక్కుగా పరిగణించడం యివన్నీ నేను వాళ్ళని యిన్‌ఫ్లూయన్స్ చెయ్యడమే కాదు. నన్నుకూడా యిన్‌ఫ్లూయన్స్ చేశాయి. మామయ్య చిన్నప్పట్నించి నిష్ఠగా పూజలు అవీ చేసినవాడు. ఆయన్ని గొప్ప వేదాంతిగా అందరూ అనుకుంటారు. ఆయన కూడా నన్ను దేముడు కిందే పరిగణించేవాడు."

"మీ మామయ్యంటే ఆ బాబయ్యగారేనా?" అనడిగాను.

"ఆయనే! ఆయనే మొదటనాకు దేముడు వాల్తాడని చెప్పింది. నేను జ్వరంతో వారం రోజులు బాధపడి సంధిలావస్తే ఆయన నామీద దేముడు వాలాడని మొట్టమొదట చెప్పారు. ఆ తర్వాతనుంచీ విధిగా ప్రతి శనివారం దేముడు వాల్తూనే ఉన్నాడు. అప్పట్నించీ నేను ప్రత్యేకమయిన మనిషిననీ, దేముడి ఏదో కార్యాన్ని నిర్వహించడానికి పుట్టినవాడ్నని నాకు అసాధ్యమయిందేమీ లేదనీ అనుకునేవాడ్ని, మొన్ననే నాకు తెల్సింది, యిదొక జబ్బని.

"ఏమయింది?" అనడిగాను ఉత్సుకతతో.

"చెబుతాను వినండి. నేను బి.ఏ. పరీక్షకి కట్టే నాకింకా మంచి వుద్యోగం వస్తుంది. నేను బి.ఏ. పరీక్షకట్టి పాసవుతానని దేముడు నా నోటితోటే చెప్పాడు. రామంగారు నా పరీక్ష గురించి తీసుకున్న శ్రమ నా కృతజ్ఞతకందనిది. అయినా నేను సరిగ్గా చదివేవాణ్ణి కాదు. "నాదు దైవానుగ్రహం వుంది. దేవుడే రాస్తాడు పరీక్ష" అనే భరోసా. ఉద్యోగ విషయంలోనూ అంతే. నాది టెంపరరీ వుద్యోగం రామంగారే ఎక్కడో ఇన్‌ఫ్లూయిన్స్ చేసి వుద్యోగం యిప్పించారు. ఆఫీసులో నేను సరిగా పని చేసేవాడ్ని కాదు. అందుకు కారణం నా నీరసం, కొంత గర్వం. శలవు లేకుండానే యెన్నోసార్లు సెలవు పెట్టేవాడ్ని. మొన్న తిరుపతి ఆఫీసరుకు తెలియపరచకుండా వెళ్ళాను. పరీక్ష రాశాక తిరుపతి వెళ్ళాలని దేముడే చెప్పాడు. ఆ దేవుడే ఆఫీసులో గొడవ రాకుండా చూసుకుంటాడని ధైర్యం. పైగా ఆఫీసర్‌గారికి నాకు దేవుడు పూనతాడనీ తెలుసు. కానీ పదిహేను రోజుల తర్వాత తిరుపతి నుండి వచ్చి నేను తెలుసుకున్న విషయాలేమిటంటే నేను బి.ఏ. పరీక్ష ఫేలయ్యాను, నన్ను ఉద్యోగంలోంచి తీసేశారు. నాకు ధైర్యం యిచ్చి నాచేత యిన్ని చేయించిన దేవుడు నాకేం సహాయం చెయ్యలేదు" అంటూ రాఘవ తల వంచుకున్నాడు.

కాసేపటికి తేరుకున్నాడు. "యింటికి వెళ్తే యింకా కొత్త విషయాలు తెలిశాయి. మా మామయ్య వాళ్ళమ్మాయి గౌరికి పెళ్ళి సంబంధం కుదిర్చారు. గౌరిని నాకిచ్చి పెళ్ళి

చేద్దామని, నా ఊహ తెలిసినప్పట్నించీ మామయ్యతోపాటు యింట్లో అందరూ అనుకునేవారు. నేను చాలా మనసు పడ్డాను కూడా. ఇప్పుడు హఠాత్తుగా ఈ నిర్ణయం ఎందుకు తీసుకున్నారో నాకర్థం కాలేదు. మామయ్యని అడిగాను. నాకు ఉద్యోగం, చదువు లేదనీ అమ్మాయి సుఖపడలేదని ఆయన అన్నాడు. నాకు ఉద్యోగం, చదువు లేకపోవడాన్కి ఆయనే కారకుడు. నాకు తండ్రి లేడు, తల్లి ఉంది కానీ అమాయకురాలు. మా మామయ్యే మా ఆస్తి సంరక్షనంతా. నేనూ వాళ్ళబ్బాయితో పాటు పి.యు.సి. పాసయినప్పుడు వాళ్ళబ్బాయిని కాలేజీలో చేర్పించాడు. నన్ను కూడా కాలేజీలో చేర్పించమని మా అమ్మ అడిగితే "వాడికీ క్షుద్రమైన చదువులెందుకే, గొప్ప భక్తుణ్ణి చేస్తాను" అని ఆయన నన్ను చిన్నప్పట్నించీ భక్తిమార్గంలో పెట్టి వివేకానందుడ్నంత చేస్తానంటూండేవాడు. వాళ్ళబ్బాయిని మాత్రం శుద్ధ దౌర్భాగ్యుడనీ, భక్తి భయం లేవని తిట్టిపోసేవాడు. నాకు చిన్నప్పట్నించీ దేవుడంటే అపారమైన భక్తి కాబట్టి చదువుమీద శ్రద్ధ చూపించేవాణ్ణి కాదు, కాని యిప్పుడు మామయ్య నా భక్తికన్నా, చదువు ఉద్యోగాలకి ఎక్కువ విలువిచ్చి వాళ్ళమ్మాయిని దక్కకుండా చేస్తున్నాడు. నేను ఎంత మనస్ఫూర్తిగా దేవుడ్ని పూజించేవాణ్ణో, అంతే మనస్ఫూర్తిగా గౌరిని ప్రేమించాను. మా మామయ్య దుష్ట భావాలన్నీ నాకర్థమయ్యాయి. ఆయనేదో వెంకటేశ్వర మందిరం కట్టిస్తానని భక్తులందరి దగ్గరా చందాలు తీసుకున్నాడు. దేవుడు నా నోటితోటే చందాలివ్వమని చెప్పాడు. అది దేవుడే చెప్పాడని నేను విశ్వసించాను. యిప్పుడా చందాలు గౌరి పెళ్ళికి ఉపయోగపడతాయని నాకర్థమయ్యింది. నాకిష్టం లేని పని జరిగిపోతుంటే నామీద వాలే దేవుడు నోరుమూసుకుని చూస్తున్నాడు.

నాకు నరనరాల్నీ గౌరిని పెళ్లి చేసుకోవాలని వుంది. "రాత్రి రహస్యంగా గౌరిని మేడమీదికి తీసికెళ్ళి "నువ్వు నన్ను తప్ప యింకెవర్నీ పెళ్ళి చేసుకోనని మామయ్యతో దెబ్బలాడు," అని చెప్పాను. అప్పుడు గౌరేమందో తెలుసాండీ 'బావా ప్రేమించిన మనిషి గొప్పవాడు కావాలని ప్రతి అమ్మాయి ఆశపడ్తుంది. కాని అసహజంగా ఉండాలని అనుకోదు. నువ్వు గొప్పవాడివి, దేవుడికి దగ్గర వాడివి అవునేమో కాని నీ జీవితంలో సహజత్వం లేదు. నిన్ను పెళ్ళి చేసుకున్న అమ్మాయికి తన సంసారంలో సాధారణమైన గ్లామర్ కూడా కన్పించదు. నువ్వు దేవుడు పూనతాడనో, పూజలు చెయ్యాలనో, సంధ్యా వందనం చెయ్యాలనో యిలాంటి విషయాలమీద ధ్యాస పెట్టుకుంటావు. నీ వయసులో ఉన్న మిగతా సాధారణ యువకులందరూ పాట కచేరి వింటమో, సినిమా చూడ్డమో, బీచ్ కెళ్ళడమో చేస్తారు. నువ్వు ప్రత్యేక మనిషివి. నాకు ప్రత్యేకమయిన వ్యక్తులతో ఎలా బతకాలో తెలీదు. ఇంటరెస్ట్ కూడా లేదు. నాకు సాధారణమైన మనుష్యులతో సాధారణంగా బతకాలని ఉంది. నిన్ను ప్రేమించలేను. క్షమించు బావా' అంటూ వెళ్ళిపోయింది. అంతకు మించి నాకు ఏం జరగాలి? ఏ దేవుడైతే నన్ను దగ్గరకు తీసుకుని అందరికన్నా ఎత్తుగా నిలబెట్టాడనుకున్నానో ఆ దేముడే నా జీవితంలో ప్రతి అందాన్నీ నాశనం చేసేశాడు. దేవుడికి దగ్గరవాడ్ననే గర్వం, దైవానుగ్రహం పొందినవాడికుండే ప్రత్యేకతా గౌరిని నాకు కాకుండా చేశాయి. దేవుడనే వాడుంటే నాకింతకన్నా అపకారం చెయ్యలేడు. నేను అన్నీ పోగొట్టుకున్నట్లే, చదువు ఉద్యోగం ప్రేమ...." అంటూ రాఘవ

ఏడవటం మొదలు పెట్టాడు.

నేను గమ్మున అతనిదగ్గరికి వెళ్ళి అతని చెయ్యి పట్టుకుని "నేనేమైనా మీకు సహాయం చెయ్యగల్నా?" అనడిగాను.

"చెయ్యడానికేం మిగల్లేదు. ఇది నా జీవితానికి సరిపోయే డిజప్పాయింట్‌మెంట్. నన్నందరూ ఫూల్‌ని చేశారు. దేవుడుకూడా నన్ను ఫూల్‌ని చేశాడు. అసలు నేనే ఓ పెద్ద ఫూల్‌ని. అందరూ జీవితంతో ఓడిపోయి దేవుడి దగ్గర ఆశ్రయం తీసుకుంటారు. నేను దేవుడి దగ్గరే మోసపోయాను. అచంచలమైన విశ్వాసంతో నమ్మిన దేవుడే ఓ పెద్ద అబద్ధమని తెలుసుకున్నప్పుడు యింక జీవితంలో నేను పొందదగ్గదేం కన్పించట్లేదు. మీరు చెప్పినట్టు నాది ఓ జబ్బని నాకు తెలిసిపోయింది. మీరు డాక్టరు కాబట్టి, ఈ విషయాన్ని దయచేసి ప్రొఫెషనల్ సీక్రెట్‌గా వుంచండి. ఇది చెప్పడానికే మీదగ్గరకు వచ్చాను. చెప్పడానికి మీరు తప్ప అర్థతున్నవాళ్ళెవరూ కన్పించలేదు. నామీద జాలి పడకండి, దేముడికే లేదు, మీ టైమ్ వేస్ట్ చేశాననుకుంటాను. క్షమించండి వస్తాను" అంటూ రాఘవ వేగంగా వెళ్ళిపోయాడు.

నేను స్తబ్దుగా నిలుచుండిపోయాను. అతని రోదన యింకా చెవుల్లో విన్పిస్తోనే వుంది.

మర్నాడు హాస్పిటల్లో వుండగా సీత దగ్గర్నుంచి ఫోను వచ్చింది. "రామం అక్కడ వున్నాడా" అని, నేను "యిక్కడ లేడ'ని చెప్తే, నన్నే ఉన్నపళంగా రమ్మంది. నేను హాస్పిటల్ నుంచే రామం యింటికి బయల్దేరాను. సీత బయటే నుంచుని వుంది.

"ఏమిటంత అర్జంటుగా రమ్మన్నావు?" అనడిగాను.

"మీ ఫ్రెండ్ పొద్దున్ననగా వెళ్ళారు. ఇంతవరకూ రాలేదు" అంది.

" ఆమాత్రం దానికి యింత కంగారెందుకు?" అన్నాను.

"అదికాదు. ప్రొద్దున ఈయన ఆఫీసుకు బయల్దేరుతుండగా రిక్షాలో గౌరి వచ్చింది. రోడ్డు మీదే ఏదో మాట్లాడింది. వెంటనే అదే రిక్షాలో యిద్దరూ కలసి వెళ్ళిపోయారు. ఆయనింతవరకూ రాలేదు. నేను బాబయ్యగారింటికి వెళ్దామంటే చంటివాడికి ఒంట్లో బాగాలేదు. గౌరి ఆయనతో మాట్లాడుతూంటె ఏడుస్తోంది కూడాను. మీ ఫ్రెండు యింతసేపు ఫోంచెయ్యకుండా ఉండలేరు. ఇంకా రాలేదంటే నాకు భయంగా ఉంది" అంది సీత కంగారుపడుతూ.

"మరేం ఫర్వాలేదు, కాసేపట్లో వాడే వస్తాడు. రాఘవ బాబయ్యగారితో ఘర్షణ పడుతున్నాడేమో. గౌరి పెళ్ళి విషయంలో, కబురంపించి ఉంటారు" అంటూ నిన్న రాత్రి రాఘవ నా దగ్గర చెప్పిందంతా సీతతో చెప్పాను.

"పాపం! అమాయకుడు" అంది సీత జాలిగా.

"అతను అమాయకుడే. అతన్ని మోసం చెయ్యాలనుకుంటే సులువుగా చెయ్యవచ్చు. స్వార్థం కోసం ఆ బాబయ్యగారే అతన్ని మోసం చేశాడు. కాని ఏ స్వార్థం లేకుండానే మన రామంకూడా మోసం చెయ్యడం ఏం బావుంది చెప్పు?".

"ఆయనేం మోసం చేశారూ!" అంది సీత.

రాఘవేదో "నేను దేవుణ్ణి" అనుకున్నాడనుకో రామంగాడి తెలివితేటలేమయ్యాయి.

వీడు కూడా గుడ్డెద్దు చేలో పడ్డట్టు "నువ్వు దేవుడివే అంటే ఏమనుకోవాలి! దాంతో ఆ రాఘవ నేను నిజంగా దేవుణ్ణి కాబోలు అనుకోడా? వాడి అమాయకత్వాన్ని అది మోసం చేసినట్టు కాదా!".

"మీ ఫ్రెండు తెలివైనవారే కానీ యింకా పసితనం పోలేదండి. ముప్పైఏళ్ళ పసివారు" అంది సీత.

అంతట్లోకే రామం వచ్చాడు. వాడి కళ్ళు ఎర్రగా ఉన్నాయి. వళ్ళంతా వణుకుతోంది. వస్తూనే కుర్చీలో కూలబడి తలదించుకున్నాడు.

"ఏమిటలా ఉన్నారు. రండి భోంచేద్దురుగానీ" అంది సీత గాభరాపడుతూ.

రామం తలెత్తి "నేను భోంచెయ్యను," అంటూ నాకేసి తిరిగి "ఒరేయ్ నాకేం శిక్ష విధిస్తావో విధించు, రాఘవ చచ్చిపోయేడ్రా. ఆత్మహత్య చేసుకున్నాడు. ఘోరంగా చస్తూ నాకో ఉత్తరం కూడా రాసిపెట్టాడు, ఆ ఉత్తరం చదివితే మేం అందరం ఎంత మూర్ఖులమో తెలిసింది. ఆ బాబయ్య వెధవని చావగొట్టేశాను. కానీ రాఘవని చంపింది వాడొక్కడే కాదురా! వాడ్ని దేముడనుకున్న మేం అందరం చంపాం. దేముడి పేరుతో ఎంత పతనం" అంటూ తల పట్టుకుని కూలబడిపోయాడు.

నేనూ, సీతా నిశ్చేష్టులమయి కూర్చుండిపోయాం. ■

● ఆంధ్రజ్యోతి వారపత్రిక – 1970 ●